

గాలిని సంధించిన బాలుడు

నిజమైన హీరో కథ




విలియం

కామ్‌క్వాంబా



మలావీ ప్రాంతంలోని ఒక ఊళ్లో ప్రజల వద్ద విద్యుత్తుకి డబ్బు లేదు. దాంతో చీకటి పడటంతోనే పేద రైతులందరూ నిద్రకి ఉపక్రమించేవాళ్లు. అయితే, విలియంకి ఆ చీకటి కలలు కనటానికి అనువుగా ఉండేది.






విలియంకి రకరకాల వస్తువులు చేసి, మళ్లీ ఊడదీయటం ఇష్టం. అతని మంచం కింద సీసా మూతలతో చేసిన ట్రక్కులు ఉన్నాయి. రేడియోలోంచి సంగీతం వినపడితే, మరి వాయిద్యకారుల బృందం ఏదీ అని దానిని ఊడదీసి ఆశ్చర్యపోయేవాడు.



చీకటిగా ఉన్న అతని గదిలో తాతయ్య చెప్పిన మాయల-మంత్రాల కథలు గుసగుసలాడుతండేవి. భూతాల విమానాలు కిటికీలోంచి దూసుకునిపోయేవి. లోపల వంద మంది ఉన్నట్టు దెయ్యాలు పిచ్చిగా నాట్యం చేసేవి.







పొద్దున మొక్కజొన్న చేనులో వింతల కోసం విలియం వెదికేవాడు. రోడ్డు మీద ట్రక్కు వెళుతుంటే ఇంజిను దానిని ఎలా నడుపుతుందని అశ్చర్యపోయేవాడు.

“పార ఎక్కడ వేస్తున్నావో చూసుకో, లేకపోతే కాలు తెగిపోద్ది," అంటూ నాన్న అరిచాడు.

మంత్ర తంత్రాలకు ఎన్ని మహిమలు ఉన్నా అవి వానని కురిపించలేక పోయేవి.

వానలు లేకపోవటంతో సూర్యుడు కోపంతో మండిపడుతున్నట్టు ఉండేది. మొక్కజొన్న పంట ఎండిపోయి మట్టిలో కలిసిపోయింది. పంటలు లేకపోవటంతో మలావి ప్రజలు ఆకలికి లోనుకాసాగారు.








ఆ పరిస్థితులలో విలియం వాళ్ల నాన్న పిల్లలందరినీ కూర్చోబెట్టుకుని, “ఇక నుంచి మనం ఒక పూట అన్నం తోనే సరిపెట్టుకోవాలి,” అని చెప్పాడు.

సాయంత్రం అందరూ దీపం చుట్టూ కూర్చుని తలా ఒక గుప్పెడు అన్నం తినేవాళ్లు. నడుస్తున్న కళేబరాల లాగా ఉన్న మనుషులు వాళ్లకి దారిన పోతూ కనిపించేవాళ్లు.




వానల తోపాటు ప్రజల వద్ద డబ్బులు కూడా మాయమై పోయాయి.

“విలియం, నాకు బాధగా ఉంది గానీ నిన్ను బడి మాన్పించక తప్పటం లేదు,” ఒక రోజు వాళ్ల నాన్న చెప్పాడు.

పొట్టలో ఆకలి నకనకలాడుతుండగా, బాధతో గొంతుక పూడుకుపోతుండగా బడికి వెళుతున్న అదృష్టవంతులను విలియం చూస్తూ ఉండిపోయేవాడు. కొన్ని వారాలపాటు బాధపడిన తరవాత అతనికి ఉన్నట్టుండి తమ ఊరికి అమెరికా ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన గ్రంథాలయం గుర్తుకు వచ్చింది.


అక్కడ అతనికి ఎన్నో మంచి బొమ్మల పుస్తకాలు కనిపించాయి. ఒక డిక్షనరీ సహాయంతో అతను పెద్ద పెద్ద ట్రక్కులను ఇంజిన్లు ఎలా నడుపుతాయో, గాలిలోని సంగీతాన్ని రేడియో ఎలా పట్టుకుంటుందో మెల్లగా అర్థం చేసుకున్నాడు. పెద్ద చెట్ల కంటే పెద్దగా ఉన్న స్తంభానికి ఉన్న పంఖా లాంటి రెక్కలు ఉన్న బొమ్మ అతనికి అన్నిటికంటే నచ్చింది.




అది పెద్ద గాలి చక్రమా? అది మాయాజాలాన్ని పట్టుకుంటుందా?

మెల్లగా అతడు అక్కడి వాక్యాన్ని పూర్తిగా చదివాడు:


“గాలి మరలు విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి, నీటిని తోడతాయి."




కళ్లు మూసుకుని, గాలి లోంచి విద్యుత్తుని లాగి తమ లోయని కాంతిమయం చేస్తున్న ఒక గాలిమరను విలియం ఊహించుకున్నాడు.



వాన కోసం రైతులు చేసిన ప్రార్థనలు విఫలమైనప్పటికీ ఈ గాలిమర నేల లోంచి నీళ్లని తోడి మొక్క జొన్నకు అందించటం వల్ల అవి ఏపుగా పెరుగుతున్నట్టు అతను ఊహించుకున్నాడు. నిజానికి, ఈ గాలిమర ఒక యంత్రం మాత్రమే కాదు, ఆకలిని జయించే శక్తి.




‘గాలి నుంచి విద్యుత్తును తయారు
చేస్తాను,’ అతను తనలో తాను అనుకున్నాడు.



వ్యర్థ పదార్థాలు పడేసే చోటుకి విలియం వెళ్లాడు. పొదవాటి గడ్డిలో తుప్పు పట్టిన నిధి లాగా అవి అతనికి కనిపించాయి. అక్కడ అతనికి ఒక ట్రాక్టరు పంఖా దొరికింది. ఒక పైపు దొరికింది. ఎంతో కష్టపడి తీయాల్సి వచ్చిన బోల్టులు, బేరింగులు దొరికాయి.

తనకు కావలసినది దొరికినప్పుడల్లా, "హే!" అంటూ అరుస్తూ ఆకాశంలోని పక్షులకు దానిని చూపిస్తున్నాడు.

వాటన్నిటిని ఇంటికి తీసుకుని వెళుతున్న విలియంని చూసి, “ఈ పిల్లవాడు పిచ్చివాడి లాగా ఉన్నాడు, చెత్త వస్తువులతో ఆడుతున్నాడు!” అన్నారు.



కొన్ని వారాలకి విలియం తన యంత్ర నమూనాని ఇసక మీద పేర్చాడు: విరిగిన సైకిలు, తుప్పు పట్టిన సీసా మూతలు, ప్లాస్టిక్ పైపు, సైకి లైటు వెలిగించే డైనమో.



చుట్టుపక్కల కుక్కలు మొరుగుతున్నాయి, కోళ్లు అరుస్తున్నాయి. చూసినవాళ్లందరూ, “ఈ పిచ్చివాడు ఏం చేస్తున్నాడు?" అంటున్నారు. విలియం ఇవేమీ పట్టించుకోకుండా మూడు రోజులపాటు బోల్టులు బిగిస్తూ, వంపులు తీస్తూ, కోస్తూ పని చేశాడు.






“నీకు ఏమైనా సహాయం చెయ్యగలమా?" అంటూ అతని బాబాయ్ కొడుకు జాఫ్రీ, ప్రాణ స్నేహితుడు గిల్బెర్ట్ వచ్చారు.


“మీ కత్తులు తీసుకుని రండి," విలియం చెప్పాడు.

వాళ్లు అడవిలోకి వెళ్లి నీలగిరి చెట్లు నరికి వాటితో ఒక స్తంభం చేశారు.



విలియం పైకి ఎక్కి ఇద్దరి స్నేహితుల సహాయంతో మరను బిగించాడు.

ఒక గుంపు కింద చేరి వింత జిరాఫీ లాగా ఊగుతున్న ఆ యంత్రాన్ని చూస్తోంది. కొంతమంది నవ్వారు, కొంతమంది వెక్కిరించారు. కానీ, విలియం గాలి కోసం వేచి ఉన్నాడు.



ఎప్పటి లాగే గాలి వచ్చింది...

ముందు మెల్లగా...

తరవాత వేగంగా...


స్తంభం ఊగింది, తరవాత రెక్కలు తిరగసాగాయి.




ఆకలితో, చీకటితో మందగించిన చేతులతో విలియం ఒక బల్బుకి విద్యుత్తు తీగలు కలిపాడు. ముందు అది మిణుకు మిణుకుమంది, తరవాత దేదీప్యమానంగా వెలిగింది.

“భలే!!" అతను అరిచాడు. “నేను గాలితో విద్యుత్తుని చేశాను!"








“బాగా చేశావ్!" ఒక వ్యక్తి అరిచాడు.

ఒకప్పుడు వెక్కిరించినవాళ్లే ఇప్పుడు అతనిని మెచ్చుకుంటూ తప్పట్లు కొట్టారు.

ఇది ఆరంభం మాత్రమేనని విలియంకు తెలుసు.

ఖాళీ పొట్టలను విద్యుత్తు నింపదు. కానీ, మరొక గాలిమర నీళ్లను తోడి, నేలను తడిపి బీడు నేలలో పంటను పండించగలదు.

‘విద్యుత్తు గాలి నా ప్రజల పొట్టలు నింపగలదు,’ విలియం అనుకున్నాడు.



అన్నిటిలోకి అదే శక్తిమంతమైన మాయాజాలం.





సబ్ సహారా ఆఫ్రికాలోని మధ్య మలావి ప్రాంతంలోని వింబే అనే ఊళ్లో 1987లో విలియం కమ్క్వాంబా పుట్టి, పెరిగాడు. ఆ ప్రాంతంలోని అందరి లాగే విలియం వాళ్ల నాన్న ట్రైవెల్ ఒక రైతు. అక్కడ మొక్కజొన్న ప్రధాన పంట, దానితో చేసే జావ వాళ్ల ప్రధాన ఆహారం. బట్టలు, మందులు వంటి ఇతర అవసరాల కోసం వాళ్లు పొగాకు పండించి రాజధాని నగరమైన లిలోంగ్వేలో అమ్మేవాళ్లు. వాతావరణంలో మార్పులు వచ్చినా, విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగినా పంటపై ఎంతో ప్రభావం చూపించేవి.

2001 - 2002లో అదే జరిగింది. తీవ్రమైన వర్షాభావం వల్ల మలావిలో పంటలు అన్నీ ఎండిపోయాయి. కొన్ని నెలలలో ఆహారానికి తీవ్ర కొరత ఏర్పడింది. దేశమంతా కరువుకి గురయ్యింది. విలియం, వాళ్ల అమ్మా, నాన్న, ఆరుగురు అక్కచెల్లెళ్లు రోజుకి ఒక్క పూటే తింటూ బక్కచిక్కి పోసాగారు. ఆ సమయంలో వాళ్ల నాన్న తాత్కాలికంగా చూపు కోల్పోయాడు. ఆ కరువు వల్ల మలావి ప్రాంతంలో పది వేల మంది చనిపోయారు.

స్కూల్ ఫీజు కట్టలేక విలియం బడి మానెయ్యవలసి వచ్చింది. అయితే, వాళ్ల ఊరికి అమెరికా ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన గ్రంథాలయానికి అతడు వెళ్లసాగాడు. అక్కడ ఉన్న విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు అతడికి ఎంతో నచ్చాయి. విలియంకు ఇంగ్లీషు అంత బాగా రాదు. ఒక డిక్షనరీ సహాయంతో అతడు ఆ పుస్తకాలను అర్థం చేసుకోసాగాడు. వాటిల్లో గాలి మరతో విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చని, భూగర్భ జలాలను పైకి తోడవచ్చని ఉంది. మలావి ప్రాంతంలో చాలామందికి లాగానే విలియం వాళ్ల ఇంటికి కరెంటు లేదు. నీళ్లు తోడగలిగితే వానలపై ఆధార పడకుండా పంటలు పండించవచ్చు. 'నేను ఒక గాలిమరను తయారు చేస్తాను,' అని విలియం అనుకున్నాడు.



గాలిమరను తయారుచెయ్యడానికి విలియం ట్రాక్టరు పంఖా, షాక్ అబ్సార్బర్, ఒక చక్రం లేని విరిగిన సైకిల్ ఉపయోగించాడు. రెక్కలకు ప్లాస్టిక్ పైపుని కరిగించి, పోత పోసి, కావలసిన ఆకారంలోకి రంపంతో కత్తిరించాడు. జెనరేటర్ కోసం సైకిల్ డైనమోని ఉపయోగించాడు. గాలి వచ్చినప్పుడు రెక్కలు, దానితో సైకిల్ చక్రం తిరిగి డైనమోతో కరెంటును ఉత్పత్తి చేసింది.

డైనమో నుంచి వచ్చిన తీగ విలియం వాళ్ల ఇంట్లోని ఒక బల్బుని వెలిగించింది. ఇది చేసినప్పుడు విలియం వయస్సు పద్నాలుగు సంవత్సరాలు.

చివరికి అతడు గాలిమరతో ఒక కారు బ్యాటరీని చార్జ్ చెయ్యగలిగాడు. దాంతో వాళ్ల ఇంట్లో నాలుగు బల్బులు వెలిగేవి. గాలిమరతో నీళ్లు తోడటానికి మరికొన్ని సంవత్సరాలు పట్టింది. 2007లో విలియం చేసిన "హరిత యంత్రం" బావి నుంచి నీళ్లు తోడటంతో వాళ్ల అమ్మ సంవత్సరం పొడవునా కూరగాయలు పండించగలిగింది. 2007లో విలియంని పత్రికా విలేఖరులు గుర్తించి తాంజానియాలో టెడ్ (TED) ప్రసంగానికి పిలిచారు. అప్పటివరకు అతను విమానం ఎక్కలేదు, ఇంటర్‌నెట్ చూడలేదు. అతడి కథ విన్న వాళ్లు అతను తిరిగి చదువును కొనసాగించటానికి సహాయం చేశారు. వాళ్ల నాన్న పొలంలో సౌరశక్తితో నడిచే మోటరు పంపును పెట్టించారు.

న్యూ హాంప్‌షైర్ లోని డానెవర్ లోని డార్ట్‌మౌత్ కళాశాలలో విలియం ఇంజినీరింగ్ చదివాడు. అతని జీవిత కథ ఆధారంగా ఒక పుస్తకం, ఒక సినిమా వచ్చాయి.